సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 11 । నవంబర్ । 2023



రూ.1.40 లక్షల విరాళం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో నిత్యాన్నదాన పథకానికి ఓజీ రవితేజారెడ్డి (కడప) శుక్రవారం రూ.1,40,000 విరాళం సమర్పించారు.



ఘనంగా మహాశాంతి హోమం

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి దివ్య క్షేత్రంలో శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి.

II లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు శుక్రవారం 5,200 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,000, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

14 నుంచి జాతీయ సహకార వారోత్సవాలు



సహకార వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అఖిల భారత సహకార వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఆయన నివాసంలో శుక్రవారం సహకార వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆకుల వీర్రాజు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో సహకార వారోత్సవాలను విధిగా నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాలను, సహకార బ్యాంకుల ఇస్తున్న రుణాలు, రాయితీలపై అవగాహన కల్పించాలన్నారు. రామదాసు సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 14న ఉమ్మడి జిల్లాలోని అన్ని సహకార సంస్థల్లో సహకార పతాకాలను ఆవిష్కరించాలన్నారు. సహకార వారోత్సవాలను ఆరోజు 14న కాకినాడ డీసీసీబీలో చైర్మన్ ఆకుల వీర్రాజు ప్రారంభిస్తారన్నారు.

ఈ వరి రకాలు సాగు చేయవద్దు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): రబీలో పీఆర్ 126, ఎస్‌ఎల్10 వరి రకాలను సాగు చేయవద్దని జాయింట్ కలెక్టర్ ఎస్. తేజ్ భరత్ శుక్రవారం ప్రకటనలో కోరారు. ఎక్కువ మంది రైతులు ఈ రకాల సాగుకు సన్నద్ధమవుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ రకాలను సాగు చేస్తే ధాన్యాన్ని ప్రైవేటుగా మాత్రమే అమ్ముకోవాల్సి ఉంటుందని, ప్రభుత్వం వీటిని కొనుగోలు చేయదని స్పష్టం చేశారు. అలాగే రైతులు వరినాట్లకు బదులు విత్తనాలు వెదజల్లే పద్ధతిని అలవాటు చేసుకోవాలని సూచించారు. దీనిద్వారా నీటి వినియోగం, కూలీ ఖర్చులు, ఏడు రోజుల పంట కాలం తగ్గించుకోవచ్చన్నారు.

17న కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలోని హోటల్ మంజీరాలో ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని ఐదు జిల్లాలకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, స్థానిక సంస్థల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, చైర్మన్లు, సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మేధావులు హాజరవుతారన్నారు.

ఉపాధి హామీ పనుల్లో నాణ్యత

సామర్లకోట: ఉపాధి హామీ పనుల్లో మరింత నాణ్యత పెరిగే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని డ్వామా అదనపు కమిషనర్ అశోక్‌కుమార్ అన్నారు. డ్వామా రాష్ట్ర స్థాయి రీసోర్సు పర్సన్లకు స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రంలో మూడు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకంలో ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఉపాధి హామీ నిధుల్లో 50 శాతం కేటాయించే ముఖ్యమైన పనులను గుర్తించాలన్నారు. అధికారులు తరచూ ఉపాధి పనులను పర్యవేక్షించాలని, మస్తర్లను పరిశీలించాలని అన్నారు.

బిడ్డకు భరోసా.. తల్లికి రక్షణ

- అంగన్‌వాడీ కేంద్రాలకు ఔషధ కిట్లు
- జిల్లాలోని 1,556 కేంద్రాలకు సరఫరా
- ఒక్కో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లో ఏడు రకాల మందులు
- 76,138 మంది చిన్నారులకు ప్రయోజనం
- 18,576 మంది గర్భిణులు, బాలింతలకు మేలు
- పిల్లల ఆరోగ్యంపై ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తల పర్యవేక్షణ



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యురాలు

రాజమహేంద్రవరం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చింది. నాడు–నేడు ద్వారా పాత భవనాలను ఆధునీకరించింది. ప్రైవేటు భవనాల్లో నడుస్తున్న కేంద్రాలకు అద్దెను పెంచింది. కేంద్రాల నిర్వహణతో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. వారికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తోంది. చిన్నారులకు ఇంగ్లిషు మీడియం బోధనకు శ్రీకారం చుట్టింది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి నెలా మొదటి, మూడు శుక్రవారాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను వైద్యులు సందర్శించేలా ఆదేశాలిచ్చింది. గర్భిణులకు, బాలింతలకు టేక్ హోం రేషన్ విధానం అమలు చేసింది. నాణ్యతలో రాజీ లేకుండా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌ఓపీ) అమలులో కచ్చితత్వం పాటించేలా చర్యలు చేపట్టింది. క్వాలిటీ సర్టిఫికేషన్ తప్పనిసరి చేసింది. అంగనవాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు 19 రకాల ఆట వస్తువులతో కూడిన కిట్లను అందించింది. పిల్లల ఎదుగుదలకు స్టడీ, ఇన్ఫాంటో మీటర్లు, సాల్టర్ స్కేల్, బరువు తూచే యంత్రాలను సమకూర్చింది.



అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన మందులు

అత్యవసర కిట్ల పంపిణీ

తాజాగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు అత్యవసర ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) కిట్లు పంపిణీ చేసింది. ఈ కిట్లలో పారాసిటమాల్ సిరప్, సిప్రోఫ్లాక్సిన్ చుక్కల మందు, ప్రమిసటిన్ స్కిన్ క్రీమ్ ఆయింట్‌మెంట్, కాటన్, ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్, సొనిడిన్ అయోడిన్, రోలర్ బ్యాండేజ్ ఉన్నాయి. సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం పేరిట పిల్లల్లో సాధారణంగా వచ్చే వ్యాధులు, ఏయే మందులను ఎంతెంత మోతాదులో ఎలా వినియోగించాలో పేర్కొంటూ తెలుగులో సమాచారం కూడా ఇచ్చారు. ఆయా మందుల వినియోగంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	:	7
అంగన్‌వాడీ కేంద్రాలు	:	1,530
మినీ కేంద్రాలు	:	26
గర్భిణులు	:	8,857
బాలింతలు	:	9,719
6 నెలల్లోపు చిన్నారులు	:	9,719
6 నెలల నుంచి ఏడాది లోపు పిల్లలు	:	9,830
ఏడాది నుంచి మూడేళ్లలోపు పిల్లలు	:	37,486
మూడు నుంచి ఆరేళ్ల మధ్య పిల్లలు	:	19,103

ఎంతో ప్రయోజనం



అంగనవాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లు పంపిణీ చేశాం. గతంలో కంటే ఈసారి వచ్చిన కిట్లలో ఎక్కువ మందులున్నాయి. ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పిల్లలకు జ్వరం, చిన్నపాటి గాయాలు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే ఈ కిట్‌లోని మందులు ఎంతో ఉపయోగపడతాయి. పిల్లల్లో సాధారణంగా వచ్చే చర్మవ్యాధుల నిర్మూలనకు సంబంధించిన ఆయింట్‌మెంట్లు ఇందులో ఉన్నాయి.

– కె.విజయకుమారి, జిల్లా మహిళ, శిశు సంక్షేమ సాధికారత అధికారి

పిల్లల ఆరోగ్య పరిరక్షణకు..



ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు ప్రతి మూడు నాలుగు రోజులకోసారి అంగన్‌వాడీ కేంద్రాల్ని పర్యవేక్షిస్తారు. కేంద్రంలోని పిల్లల ఎదుగుదల, ఎత్తు, బరువు పరీక్షల నిర్వహణతో పాటు కిట్‌లోని మందులను అవసరమైన వారికి అందిస్తారు. ఫస్ట్ ఎయిడ్ కిట్‌లోని మందులపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు.

– బేబీరాణి, సూపర్‌వైజర్, ఐసీడీఎస్, బొమ్మూరు సెక్టార్

జగమంత కుటుంబం జగనన్నది

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో ఎంపీ భరత్ రామ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: జగమంత కుటుంబంగా ఎదిగిన జగనన్నను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ పిలుపునిచ్చారు. స్థానిక వై.జంక్షన్‌లోని ఆనం రోటరీ హాల్లో శుక్రవారం జరిగిన వైఎస్సార్ సీపీ నగర సోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైతే పార్టీ పటిష్టత కోసం నిస్వార్థంగా పనిచేస్తారో అటువంటి వారి సేవలు గుర్తించి, భవిష్యత్తులో సమున్నత స్థానాన్ని జగనన్న కల్పిస్తారన్నారు. కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో చేస్తున్న ట్రోలింగ్‌ను ప్రతి ఒక్కరూ సైనికుల్లా తిప్పికొట్టాలన్నారు. 2024 ఎన్నికల్లో సిటీ నియోజక వర్గం నుంచి మన పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మజ్జి అప్పారావు, పితా రామకృష్ణ,నక్కా నగేష్, తదితరులు పాల్గొన్నారు.

కాగా.. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సిరుగుడి పైడిరాజు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు ఎంపీ భరత్ రామ్, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్–3 అధ్యక్షుడు మజ్జి అప్పారావు సాదరంగా ఆహ్వానం పలికారు.

మహిళల రక్షణ, భద్రత ‘దిశ’గా..

- జిల్లాలో దిశాయాప్ ప్రత్యేక డ్రైవ్
- ఒకేరోజు 20,069 మంది డౌన్‌లోడ్



దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో శుక్రవారం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా 20,069 మంది మహిళలు దిశాయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. మహిళల రక్షణ, భద్రతే లక్ష్యంగా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కాలేజీలు, స్కూళ్లు, సచివాలయాలు, ఆర్టీసీ కాంప్లెక్స్‌లు, రైల్వే స్టేషన్లు, హాస్పిటళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ముఖ్య కూడళ్లలో దిశ యాప్‌పై యువతలు, మహిళలకు అవగాహన కల్పించారు. దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో మహిళలు, యువతులను వారి ఫోన్‌కు వచ్చే ఓటీపీని పోలీసులు అడక్కూడదని ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ యువతులు, మహిళలు కచ్చితంగా దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆపదలో ఉన్నప్పుడు పోలీసులతో పాటు ఐదుగురు కుటుంబసభ్యులు, స్నేహితులకు తక్షణం సమాచారం చేరవేసే ఏర్పాటు దిశ యాప్‌లో ఉంటుందన్నారు. ప్రయాణ సమయంలో ట్రాక్ మై ట్రావెల్ ఆప్షన్ ఉంటుందని, చేరాల్సిన గమ్యస్థానాన్ని నమోదు చేస్తే అనుక్షణం యాప్ ట్రాకింగ్ చేస్తుందన్నారు. వాహనం దారి తప్పితే ఆ సమాచారం వెంటనే దిశ కమాండ్ కంట్రోల్ రూమ్‌తో పాటు బంధుమిత్రులకు చేరవేస్తుందన్నారు. దిశ యాప్‌లో 100, 112 వంటి అత్యవసర నంబర్లతో పాటు పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులు, మెటర్నిటీ సెంటర్లు, బ్లడ్ బ్యాంకులు, ట్రామా కేర్ సెంటర్లు, మెడికల్ షాపుల వివరాలు పొందుపర్చారన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఫోన్‌ను గట్టిగా అటూ ఇటూ ఊపితే చాలు పోలీసులకు సందేశం చేరుతుందన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’పై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ మాధవీలత
- నిర్వహణపై అధికారులతో సమీక్ష



ఆడుదాం ఆంధ్రపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఆడుదాం ఆంధ్ర యువజన క్రీడల టోర్నమెంట్‌ను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ మాధవీలత అధికారులకు సూచించారు. ఆ టోర్నమెంట్‌పై శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 15 ఏళ్లు పైబడిన యువకులకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. దీనిపై ఆయా సచివాలయాల్లో పరిధిలో ప్రచారం చేపట్టాలన్నారు. ఆటలతో ఆరోగ్యకర జీవనం అలవడుతుందన్నారు. క్రికెట్, యోగా, వాలీబాల్, టెన్నికాయిట్, కబడ్డీ, ఖోఖో, మారథాన్, బ్యాడ్మింటన్, ఇతర సంప్రదాయ ఆటల పోటీలు జరుగుతాయన్నారు. ఇందుకోసం 19 మండలాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి ఇన్‌చార్జులను నియమించామన్నారు. దీపావళి షెడ్యూల్ తర్వాత నవంబర్ 15 నుంచి 18 వరకూ నిర్వహించే ఐదు విభాగాలకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో క్రీడా వలంటీర్లకు శిక్షణ ఇస్తామన్నారు. జిల్లాలోని 19 మండలాల పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో 393 గ్రామ, 119 వార్డు సచివాలయాల నుంచి 512 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, డీఎల్‌డీవో వీణాదేవి, జిల్లా స్పోర్ట్స్ అధికారి ఎంవీవీ శేషగిరిరావు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

సహకార డెయిరీ రంగాన్ని బలోపేతం చేసేందుకు, తద్వారా మహిళల ఆర్థిక పరిపుష్టికి జగనన్న పాల వెల్లువ ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ మాధవీలత అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న పాలవెల్లువ కార్యక్రమంపై సంబంధిత మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాడి పశువుల అభివృద్ధికి సంబంధిత అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. నవంబరు 15 నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించే దిశగా ఈనెల 30వ తేదీ వరకూ సర్వే నిర్వహించి, లబ్ధిదారుల నుంచి అంగీకారం తీసుకోవాలన్నారు. డిసెంబర్ ఒకటి నాటికి రైతుల నుంచి పూర్తి స్థాయిలో డ్యాక్యుమెంటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పాడి పశువుల పెంపకానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. మండలాల వారీగా యానిమల్ గ్రౌండింగ్ యూనిట్లుగా మొత్తం 1500 మంది రైతులకు 1400 యూనిట్లను అందించామన్నారు. జేసీ ఎస్.తేజ్ భరత్ మాట్లాడుతూ శ్రీనిధి, చేయూత లబ్ధిదారులను పాడి పశువులను కొనుగోలు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎస్‌జీటీ సత్యగోవింద్, డీఎల్‌డీవో పి.వీణా దేవీ, ఎల్‌డీఎం డి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాల ప్రయోజనం

- కలెక్టర్ మాధవీలత
- ఉత్సాహంగా ‘వై ఏపీ నీడ్స్ జగన్’

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తోందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు సచివాలయం పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె డిజిటల్ బోర్డును ఆవిష్కరించి, అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాతేరు గ్రామ సచివాలయం–1 పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ కింద 5314 మంది లబ్ధిదారులకు రూ.18,52,16,259 ప్రయోజనం చేకూర్చడం జరిగిందన్నారు.అర్హత కలిగి సంక్షేమ పథకాల ప్రయోజనం అందక పోతే.. వలంటీర్ ద్వారా గ్రామ సచివాలయానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కాతేరు గ్రామస్తులకు తొర్రేడు లే అవుట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు. కాతేరు సచివాలయం పరిధిలో 31 పథకాల కింద రూ.18.52 కోట్ల మేర ప్రయోజనం చేకూర్చామన్నారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె.వీణా దేవి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, నోడల్ ఆఫీసర్ తాడి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి కె.హనుమంతరావు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి, కాతేరు సచివాలయ కన్వీనర్లు ఆచంట కల్యాణ్ రామ్, బాగాల వెంకట రామారావు, బళ్ల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు యెజ్జు వాసు, మద్దా దుర్గారావు, మేకా సూర్యారావు, ఆచంట సాయిబాబు, రంజిత్, పెనుమాక సునీల్, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.



కాతేరులో డిజిటల్ బోర్డును పరిశీలిస్తున్న జిల్లాకలెక్టర్ మాధవీలత

క్లుప్తంగా

25 టన్నుల బియ్యం పట్టివేత


పట్టుబడిన బియ్యం లారీ

కొవ్వూరు: అక్రమంగా తరలిస్తున్న 25 టన్నుల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరా అధికారులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ జి.బాపిరాజు శుక్రవారం ఈ వివరాలు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తెలంగాణలోని ఖమ్మం నుంచి కాకినాడ పోర్టుకు లారీలో భారీగా రేషన్ బియ్యం తరలిస్తున్నారు. దీనికి సంబంధించి ఎటువంటి ఆధారాలూ చూపకపోవడంతో బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, నిడదవోలులోని పౌర సరఫరాల గోదాముకు తరలించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కం ఓనర్ షేక్ నాగూర్ మీరా, బియ్యం పంపిన వ్యాపారి ఖమ్మం నగరానికి చెందిన ఎ.వెంకటేశ్వరరావుపైన 6ఏ కేసు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.10 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. లారీతో కలిపి పట్టుకున్న సొత్తు రూ.23 లక్షలని బాపిరాజు తెలిపారు.

కల..కసి..కలగలసి..

మంచి ప్యాకేజీతో వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కాదనుకున్నాడు. ప్రభుత్వ రంగంలో ప్రజాసేవతో వీలున్న కొలువు కావాలనుకున్నాడు. వరుస పరాజయాలు ఎదురైనా ధిక్కరించాడు. లక్ష్య సాధనకు పరాక్రమించాడు. ఏ దశలోనూ నిరాశను దరి చేరనీయరాదనుకున్నాడు. ఆత్మవిశ్వాసమే మార్గమని విశ్వసించాడు. ఫలితంగా ఈ ఏడాది నాలుగు నెలల వ్యవధిలో నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. చివరకు గ్రూప్–1 ద్వారా డీఎస్పీ ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకున్నాడు ఓ హెడ్ కానిస్టేబుల్ కుమారుడు చుక్కల సూర్యకుమార్. అయినప్పటికీ అంతిమ లక్ష్యం .. సివిల్స్‌పై గురి వీడలేదు. నిరంతర పరిశ్రమకు చిరునామాగా నిలిచే సూర్యకుమార్‌ను ఒకసారి పలకరిస్తే..

– సాక్షి డెస్క్, రాజమహేంద్రవరం



పేరు	: చుక్కల సూర్యకుమార్
తండ్రి	: వెంకటరమణ, హెడ్‌కానిస్టేబుల్
తల్లి	: లక్ష్మి, గృహిణి
చదువు	: బీటెక్ (ట్రిపుల్ ఐటీ, నూజివీడు)
ఎంపిక	: గ్రూప్–1లో డీఎస్పీ (జైళ్లు)
ప్రస్తుతం ఉంటున్నది	: వేమగిరి (తూర్పు గోదావరి)

- డీఎస్పీగా ఎంపికైన హెడ్ కానిస్టేబుల్ కుమారుడు
- వరుస వైఫల్యాలను అధిగమించి సాధించిన వైనం
- ఈ ఏడాది నాలుగు నెలల్లో నాలుగు కొలువులు
- అయినా సివిల్స్ లక్ష్యంగా శ్రమిస్తున్న యువకుడు

మాది మధ్య తరగతి కుటుంబం. సొంత ఊరు కాకినాడ జిల్లా తొండంగి మండలం పైడికొండ. నాన్న వెంకట రమణ కడియం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్. అమ్మ లక్ష్మి గృహిణి. తమ్ముడు గోవిందరాజు, అక్క స్వాతి ఉన్నారు. తమ్ముడు ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివి ప్రస్తుతం ఢిల్లీ ఎయిమ్స్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజీలో సూపర్ స్పెషాలిటీ చేస్తున్నాడు. నాకు టెన్త్‌లో మంచి మార్కులొచ్చాయి. స్టేట్‌లో ఆరో ర్యాంకు వచ్చింది. ఆ మార్కులు ఆధారంగా 2008లో నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. అక్కడ నా చదువుకు గట్టి పునాది పడింది. ఇంటర్‌లో కూడా స్టేట్ సెకండ్ ర్యాంక్ వచ్చింది. యూనివర్సిటీ స్థాయిలో టాప్ టెన్‌లో ఒకడిగా నిలిచాను. 2014లో బీటెక్ అయ్యాక ఇన్ఫోసిస్ ఉద్యోగానికి క్యాంపస్‌లో సెలక్టయ్యాను. అప్పట్లోనే నాకు వార్షిక జీతం రూ.35 లక్షలు. అందులో కొనసాగి ఉంటే ఇప్పుడు రూ.కోటిన్నరకు చేరేవాడిని.

త్రుటిలో చేజారిన అవకాశాలు

ఎక్కువ జీతం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నాకు సంతృప్తి కలిగించలేదు. అందులో సంతోషంతో ఇమడలేకపోయాను. రెండేళ్లు పని చేశాను. కానీ పబ్లిక్ సర్వీసుతో సంబంధమున్న ప్రభుత్వ ఉద్యోగం చేయాలనే కోరిక నాలో బలంగా నాటుకుపోయింది. ఇదే విషయాన్ని నాన్నతో చెప్పాను. ఆ ఉద్యోగానికి రాజీనామా చేశాను. మా కుటుంబ ఆర్థిక పరిస్థితులకు ఇది ఇబ్బందికరమైనా నాన్న నన్ను ప్రోత్సహించారు. ఢిల్లీలో సివిల్స్ కోచింగుకు జాయినయ్యాను. 2017–20 మధ్య నాలుగుసార్లు రాశాను. ఇంటర్వ్యూ దశకు చేరుకోలేకపోయాను. ఇదే సమయంలో ఇతర పోటీ పరీక్షలపై దృష్టి పెట్టాను. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్, ఎస్సెస్సీ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షల్లో తుది జాబితాలో మిస్సయ్యాను. 2020 గ్రూప్–2లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో అవకాశం పోయింది. అదే ఏడాది గ్రూప్–1 మెయిన్స్‌కు అర్హత సాధించినా ఇంటర్వ్యూ పోయింది. ఎస్సెస్సీ సీజీఎల్, నాబార్డు, ఆర్‌బీఐ.. ఇలా నాలుగైదు పరీక్షలు పాసైనా త్రుటిలో విజయం దూరమయ్యేది. ఈ దశలో మానసిక దృఢత్వం కోల్పోతానేమోనని సంశయించాను. అయినా పట్టుదలతో కష్టపడేవాడిని. నిరాశ చెందేవాడిని కాదు.

అంతిమ లక్ష్యం సివిల్స్

2023– ఈ ఏడాది నా జీవితంపై చాలా మంచి ప్రభావం చూపించింది. వరుస వైఫల్యాల నుంచి గట్టెక్కించేలా చేసింది. నాలుగు నెలల వ్యవధిలో నాలుగు ఉద్యోగాలు వచ్చాయి. దేవదాయ శాఖలో ఈఓ పోస్టుకు ఎంపికయ్యాను. కాగ్ అకౌంటెంటుగా సెలక్టయ్యాను. సరదాగా రాసిన గ్రూప్–4 ఉద్యోగమూ వచ్చింది. గ్రూప్–1లో విజేతగా నిలిచాను. జైల్స్ డీఎస్పీగా ఎంపికయ్యాను. ప్రస్తుతానికి దేవదాయ శాఖలో ఈఓ శిక్షణ పొందుతున్నా.. వచ్చే జనవరిలో డీఎస్పీ ట్రైనింగ్ ఆర్డర్ రాగానే వెళ్లాలని నిర్ణయించుకున్నాను. డీఎస్పీ అయినా నా జీవిత లక్ష్యం మాత్రం సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావాలన్నదే. ఎలాగైనా సాధిస్తానని నమ్మకం ఉంది.



కుటుంబ సభ్యులతో సూర్య కుమార్

లక్ష్యం నిర్ణయించుకుని శ్రమించాలి

జీవితంలో ఏం చేయాలనుకుంటున్నామో మన సామర్థ్యానికి అనుగుణంగా ముందుగానే లక్ష్యం నిర్ణయించుకోవాలి. ఏదైనా సాధించాలంటే కష్టం తప్ప మరో మార్గం ఉండదని తెలుసుకోవాలి. ఒడుదొడుకులు ఎదురైనా ఏ సమయంలోనూ ఆత్మవిశ్వాసాన్ని దూరం చేసుకోకూడదు. నేనైతే ఈ పరీక్షల ప్రిపరేషనులో అన్ని సరదాలు, షికారులు వదులుకున్నాను. ఫెయిల్యూర్స్ వస్తున్నా నిరాశ పడకుండా ప్రయత్నం కొనసాగించాలి. ప్రణాళిక ప్రకారం ప్రిపేరైతే తప్పకుండా విజయం సాధిస్తాం.

– చుక్కల సూర్యకుమార్

325 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

పి.గన్నవరం: అక్రమంగా తరలిస్తున్న రూ.1.63 లక్షల విలువైన 325 కిలోల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారి కథనం ప్రకారం.. రాజోలు మండలం ములికిపల్లికి చెందిన మినీ వ్యాన్ యజమాని పి.కృష్ణార్జునరావు.. కడలి, జగ్గన్నపేట ప్రాంతాల్లో రేషన్ కార్డుదారుల నుంచి ఈ బియ్యాన్ని కిలో రూ.20 వంతున కొనుగోలు చేసి, పి.గన్నవరం పరిసర ప్రాంతాల్లోని ఇటుక బట్టీల కార్మికులకు రూ.24 చొప్పున విక్రయిస్తున్నాడు. ఇదేవిధంగా శుక్రవారం బియ్యం తరలిస్తుండగా నాగుల్లంక వద్ద ఆ మినీ వ్యాన్‌ను అధికారులు పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న కృష్ణార్జునరావు, డ్రైవర్ సీహెచ్ రమేష్‌పై కేసు నమోదు చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతోందని రీజినల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ తెలిపారు. రేషన్ బియ్యం కొన్నా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నాగవెంకటరాజు, తహసీల్దార్ విజయకుమార్, కానిస్టేబుళ్లు, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మహాశాంతి హోమం


మహాశాంతి హోమంలో పాల్గొన్న ప్రముఖులు


స్వామి వారి చక్రస్నానంలో భక్తుల కోలాహలం

- కోలాహలంగా చక్రస్నానం
- వాడపల్లిలో ముగిసిన వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం: పావన గౌతమీ గోదావరి తీరాన కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి దివ్యక్షేత్రంలో శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ నెల 2న ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగానే వాడపల్లిలో కూడా ఏటా స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల చివరి రోజైన శుక్రవారం ఉదయం స్వామి వారికి తీర్థపు బిందె, సుప్రభాత సేవ, నిత్యహోమాలు, ప్రత్యేక పూజలు, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మహాశాంతి హోమం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, అవభృథ స్నానం, ధ్వజారోహణ.. సాయంత్రం మహదాశీర్వచనం, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి ప్రముఖ పారిశ్రామికవేత్త మేడపాటి శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు పట్టు వస్త్రాలు అందజేశారు. కుటుంబ సమేతంగా హోమం పూర్ణాహుతిలో పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవ క్రతువులను ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యాన వేద పండితులు, అర్చకులు నిర్వహించారు. స్వామి వారిని పట్టు వస్త్రాలు, రంగురంగుల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి భక్తులు ఆర్జిత సేవలు నిర్వహించుకున్నారు.


స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

చొల్లంగిలో రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న కారు
- ఆ కారును ఢీకొన్న మరో ఆటో
- 14 మందికి గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216పై చొల్లంగి వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, కోరంగి పోలీసుల కథనం ప్రకారం.. అమలాపురం నుంచి కాకినాడ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. అదే సమయంలో కాకినాడ వైపు నుంచి చొల్లంగిపేట వెళ్తున్న మరో ఆటో ఆ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు ఆటోల డ్రైవర్లతో పాటు ఆయా ఆటోల్లోని 10 మంది ప్రయాణికులు, కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తాళ్లరేవు మండలం చొల్లంగిపేటకు చెందిన ఆటో డ్రైవర్లు ఈర్ల బాబూరావు, తులసి శ్రీనివాసరావుతో పాటు కోనాడ కామేశ్వరి, శ్రీకోటి లక్ష్మి, కోనాడ సత్యవతి, నీలపల్లి లక్ష్మి, రామిశెట్టి ఎల్లారి, సోది పద్మ, నీలపల్లి దేవి, గంపల నూకరత్నం; తాళ్లరేవుకు చెందిన మేకల కస్తూరి, మేకల ఆనంద్; కారులో ప్రయాణిస్తున్న దొంగ రామచంద్రరావు, సునీత దంపతులు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్సులలో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చేపల విక్రయానికి వెళ్లి వస్తూ..

చొల్లంగిపేట గ్రామానికి చెందిన మహిళలు ప్రతి రోజూ మత్స్య ఉత్పత్తుల విక్రయానికి ఆటోల్లో సామర్లకోట, పెద్దాపురం వెళ్లి వస్తూంటారు. రోజూ మాదిరిగానే ఒకే ఆటోలో వెళ్లిన ఎనిమిది మంది మత్స్యకార మహిళలు తిరిగి స్వగ్రామానికి తిరిగి బయలుదేరారు. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది మే నెలలో కోరంగి పంచాయతీ సుబ్బారాయుని దిమ్మ వద్ద ఒక ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొని ఎనిమిది మంది మృతి చెందిన విషయం తెలిసిందే. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ఆటోవాలాల తీరు మారకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


చొల్లంగి వద్ద ఆటోను ఢీకొన్న కారు

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రాష్ట్ర స్థాయికి ప్రాజెక్టుల ఎంపిక



మండపేట విద్యార్థినులను అభినందిస్తున్న డీఈఓ కమలకుమారి తదితరులు


రాష్ట్రస్థాయికి ఎంపికై, షీల్డ్ అందుకుంటున్న మోడేకుర్రు విద్యార్థులు, గైడ్ టీచర్ మురళి

మండపేట/కొత్తపేట: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనలో విద్యార్థులు తమ ప్రతిభతో మెరిశారు. అమలాపురంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూలులో ఇటీవల ఈ పోటీలు జరిగిన విషయం తెలిసిందే. ఇందులో మండపేట, కొత్తపేట మండలం మోడేకుర్రు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. వీరిని డీఈఓ ఎం.కమలకుమారి, జిల్లా సైన్స్ అధికారి జీవీస్ సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు. మండపేట గౌతమీ మున్సిపల్ స్కూల్ విద్యార్థులు లావణ్య, స్పందన సరికొత్త ఆలోచనను ఆవిష్కరించారు. పండ్ల తొక్కలు, ఆహార పదార్థాల వ్యర్థాల నుంచి ఇంట్లో దుస్తులు, టాయిలెట్స్, ఫ్రిజ్ తదితర గృహోపకరణాలు శుభ్రపరచుకునేందుకు అవసరమైన రసాయనాలు తయారు చేయడంపై వారు ఈ ప్రాజెక్టు రూపొందించారు. వారికి జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మేకా రామలక్ష్మి గైడ్‌గా వ్యవహరించారు. ఈ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ శోభావళి శుక్రవారం ఈ విషయం తెలిపారు. అలాగే, మోడేకుర్రు జెడ్పీ హైస్కూలులో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు జీహెచ్‌డీవీ సాయి, పి.ఉదయ్ శ్రీనివాస్‌లు 'నో యువర్ ఎకో సిస్టమ్' అనే అంశంలో ప్రాజెక్టు రూపొందించారు. ఇది కూడా రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ విద్యార్థులకు వి.మురళీకృష్ణారావు గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. వీరిని సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి, ఎంఈఓ–1, 2లు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, హెచ్ఎం వీవీఎస్ రామచంద్రమూర్తి తదితరులు అభినందించారు.

సాక్షి స్పోర్ట్స్
శనివారం
11-11-2023



సౌత్‌జోన్ జట్టులో త్రిష

సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే సౌత్‌జోన్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో హైదరాబాద్ నుంచి గొంగడి త్రిష, భోగి శ్రావణి... ఆంధ్ర నుంచి బారెడ్డి అనూష, ఎస్.అనూష, నీరగట్టు అనూష ఎంపికయ్యారు. ఈ టోర్నీ ఈనెల 24 నుంచి డిసెంబర్ 4 వరకు లక్నోలో జరుగుతుంది. హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల త్రిష ఈ ఏడాది అండర్-19 మహిళల ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో సభ్యురాలిగా ఉంది.



సెమీఫైనల్లో సుమిత్

హెల్సింకి ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రపంచ 69వ ర్యాంకర్ ఎమిల్ రుసువోరి (ఫిన్‌లాండ్)తో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 169వ ర్యాంకర్ సుమిత్ తొలి సెట్‌ను 6-3తో గెలిచి, రెండో సెట్‌లో 3-1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ దశలో ఎమిల్ గాయం కారణంగా వైదొలగడంతో సుమిత్‌ను విజేతగా ప్రకటించారు. నేడు జరిగే సెమీఫైనల్లో ఇటలీ ప్లేయర్ స్టెఫానో ట్రావాగ్లియాతో సుమిత్ ఆడతాడు.

ఇరుగు దిష్టి... పొరుగు దిష్టి...

రచిన్‌కు దిష్టి తీసిన అమ్మమ్మ



సాక్షి, బెంగళూరు: వన్డే ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శన కనబరుస్తున్న న్యూజిలాండ్ క్రికెటర్ రచిన్ రవీంద్ర భారత సంతతికి చెందిన వాడని తెలిసిందే. రచిన్ కన్నడిగుడు. ఇప్పటికీ అతని మూలాలు బెంగళూరుతో ముడిపడే ఉన్నాయి. అందుకే శ్రీలంకతో మ్యాచ్ ముగియగానే రచిన్ అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. తన మనవడు పుట్టింది విదేశంలో అయినా స్వదేశీ అలవాట్లు, సంప్రదాయాలు బాగా తెలిసిన పెద్దావిడ (అమ్మమ్మ) తన ఇంటికి రాగానే రచిన్‌ను సోఫాలో కూర్చోబెట్టి దిష్టి తీసింది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరలవుతోంది. కివీస్‌లో స్థిరపడిన రచిన్ తల్లిదండ్రులు దీప, రవి కృష్ణమూర్తి బెంగళూరు వాసులు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన రవి వృత్తిరీత్యా 1990లో కివీస్‌కు వలస వెళ్లగా... 1999లో వెల్లింగ్టన్‌లో రచిన్ జన్మించాడు. రవి కృష్ణమూర్తికి క్రికెట్ అంటే ఇష్టం. భారత దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్‌లంటే అభిమానం. అందువల్లే తన కుమారుడికి వారిద్దరి పేర్లు కలిపి పెట్టారు. తనకిష్టమైన క్రికెట్‌లో బ్యాటర్‌ను చేశాడు.

రచిన్‌కు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు



దుబాయ్: రచిన్ రవీంద్ర ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. ప్రస్తుత వరల్డ్‌కప్‌లో రచిన్ అత్యధిక పరుగులు (565) చేసిన రెండో బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. లీగ్ దశలో మొత్తం 9 మ్యాచ్‌లాడిన ఈ కివీస్ ఓపెనర్ 3 శతకాలు, 2 అర్ధసెంచరీలు సాధించాడు. న్యూజిలాండ్ సెమీస్ చేరడంలో కీలక భూమిక పోషించాడు. ఈ నిలకడైన ప్రదర్శనే అతనికి ఐసీసీ అవార్డుకు ఎంపిక చేసింది. రేసులో ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్ (591), భారత సీమర్ బుమ్రా (15 వికెట్లు) ఉన్నప్పటికీ అవార్డు మాత్రం రచిన్‌నే వరించింది. 2021 జనవరి నుంచి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు ఇస్తోంది. రచిన్‌కంటే ముందు న్యూజిలాండ్ నుంచి డెవాన్ కాన్వే (2021-జూన్), ఎజాజ్ పటేల్ (2021-డిసెంబర్) ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు గెల్చుకున్నారు.

శ్రీలంక క్రికెట్ బోర్డు సస్పెండ్

ఐసీసీ నిర్ణయం

దుబాయ్: శ్రీలంక క్రికెట్ బోర్డు వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కఠిన నిర్ణయం తీసుకుంది. శ్రీలంక క్రికెట్ బోర్డు సభ్యత్వాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు... ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని శుక్రవారం ఐసీసీ ప్రకటించింది. ఈనెల 21న ఐసీసీ బోర్డు సమావేశం జరుగుతుందని, ఆ తర్వాతే శ్రీలంక బోర్డు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత వస్తుందని ఐసీసీ తెలిపింది. భారత్‌లో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక నిరాశాజనక ప్రదర్శన చేసింది. ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచింది. దాంతో శ్రీలంక జట్టు ఆటతీరుపై ఆ దేశ ప్రభుత్వ క్రీడా మంత్రి రోషన్ రణసింఘే ఆగ్రహం వ్యక్తం చేస్తూ శ్రీలంక క్రికెట్ బోర్డును రద్దు చేశారు. మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన తాత్కాలిక కమిటీని నియమించారు. అయితే ఈ నిర్ణయంపై బోర్డు కోర్టుకు వెళ్లింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కోర్టు క్రికెట్ బోర్డును పునర్నియమించింది. జింబాబ్వే (2021) తర్వాత ఐసీసీ ద్వారా సస్పెన్షన్‌కు గురైన రెండో పూర్తిస్థాయి సభ్యత్వ దేశం శ్రీలంక కావడం గమనార్హం.

దర్జాగా దక్షిణాఫ్రికా గెలుపు

- ఐదు వికెట్ల తేడాతో సఫారీ విక్టరీ
- రాణించిన కొయెట్జీ, డసెన్
- ప్రపంచకప్‌ను ఓటమితో ముగించిన అఫ్గానిస్తాన్
- అజ్మతుల్లా పోరాటం వృథా



డసెన్

అహ్మదాబాద్: ఈ వన్డే వరల్డ్‌కప్‌లో అందరినీ ఆకట్టుకున్న అఫ్గానిస్తాన్ పోరాటం చివరకు పరాజయంతో ముగిసింది. ఇది వరకే సెమీఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచి ఈనెల 16న కోల్‌కతాలో ఆస్ట్రేలియాతో జరిగే రెండో సెమీఫైనల్ పోరులో పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగనుంది. నిర్ణీత తొమ్మిది లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసుకున్న దక్షిణాఫ్రికా ఏడో విజయంతో 14 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అసాధ్యమైన సమీకరణంతో సెమీఫైనల్ ఆశలు వదులుకున్న అఫ్గానిస్తాన్ ఈ మెగా ఈవెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తోపాటు మాజీ విశ్వవిజేతలు పాకిస్తాన్, శ్రీలంకలను ఓడించామన్న సంతృప్తితో స్వదేశానికి వెళ్లనుంది. నరేంద్ర మోదీ స్టేడియంలో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 244 పరుగుల వద్ద ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (107 బంతుల్లో 97 నాటౌట్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేసి సెంచరీకి మూడు పరుగుల దూరంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జీ 4, ఎన్‌గిడి, కేశవ్ మహరాజ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం సునాయాస లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 47.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వాన్‌డర్ డసెన్ (95 బంతుల్లో 76 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచి గెలిపించాడు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్ ఖాన్, మొహమ్మద్ నబీ చెరో 2 వికెట్లు తీశారు.

ఒమర్జాయ్ ఒంటరిగా...

ఓపెనర్లు ఇబ్రహీమ్ జద్రాన్ (15), రహ్మనుల్లా గుర్బాజ్ (22 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) పెద్దగా రాణించలేదు. కెప్టెన్ హష్మతుల్లా (2) కూడా నిరాశపరచడంతో 45 పరుగులకే 3 వికెట్లను కోల్పోయిన అఫ్గాన్‌ను మిడిలార్డర్ బ్యాటర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ ఆదుకున్నాడు. 71 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అవతలివైపు రహ్మత్ షా (46 బంతుల్లో 26; 2 ఫోర్లు), ఇక్రామ్ (12), రషీద్ ఖాన్ (14), నూర్ అహ్మద్ (32 బంతుల్లో 26; 4 ఫోర్లు) ఇలా ఏ ఒక్కరు బాధ్యతగా క్రీజులో నిలువలేకపోయినా... అజ్మతుల్లా మాత్రం కడదాకా నిలబడి ఒంటరి పోరాటం చేశాడు. శతకానికి 3 పరుగుల దూరంలో అజేయంగా నిలిచాడు. అతని పోరాటం వల్లే అఫ్గాన్ ఆ మాత్రం స్కోరు చేసింది.



ఒమర్జాయ్

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) క్లాసెన్ (బి) కేశవ్ 25; జద్రాన్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 15; రహ్మత్ షా (సి) మిల్లర్ (బి) ఎన్‌గిడి 26; హష్మతుల్లా (సి) డికాక్ (బి) కేశవ్ 2; అజ్మతుల్లా ఒమర్జాయ్ (నాటౌట్) 97; ఇక్రామ్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 12; నబీ (సి) డికాక్ (బి) ఎన్‌గిడి 2; రషీద్ ఖాన్ (సి) డికాక్ (బి) ఫెలుక్‌వాయో 14; నూర్ అహ్మద్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 26; ముజీబ్ (సి) మార్క్‌రమ్ (బి) కొయెట్జీ 8; నవీనుల్ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 244.** వికెట్ల పతనం: 1-41, 2-41, 3-45, 4-94, 5-112, 6-116, 7-160, 8-204, 9-226, 10-244. బౌలింగ్: రబడ 10-0-40-0, ఎన్‌గిడి 8.3-0-69-2, మార్క్‌రమ్ 4.3-0-25-0, కొయెట్జీ 10-1-44-4, కేశవ్ మహరాజ్ 10-1-25-2, ఫెలుక్‌వాయో 7-0-36-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నబీ 41; బవుమా (సి) గుర్బాజ్ (బి) ముజీబ్ 23; డసెన్ (నాటౌట్) 76; మార్క్‌రమ్ (సి) నవీనుల్ (బి) రషీద్ 25; క్లాసెన్ (బి) రషీద్ ఖాన్ 10; మిల్లర్ (సి అండ్ బి) నబీ 24; ఫెలుక్‌వాయో (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (47.3 ఓవర్లలో 5 వికెట్లకు) 247. వికెట్ల పతనం:** 1-64, 2-66, 3-116, 4-139, 5-182. **బౌలింగ్:** ముజీబ్ 10-0-51-1, నవీనుల్ 6.3-0-52-0, నబీ 10-1-35-2, ఒమర్జాయ్ 1-0-8-0, రషీద్ ఖాన్ 10-1-37-2, నూర్ అహ్మద్ 9-0-49-0, రహ్మత్ షా 1-0-12-0.

ఆదుకున్న డసెన్

సునాయాస లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓపెనర్లు డికాక్ (47 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ బవుమా (28 బంతుల్లో 23; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించి మంచి ఆరంభమే ఇచ్చారు. అయితే మార్క్‌రమ్ (32 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్), క్లాసెన్ (10) లాంటి కీలక బ్యాటర్లు విఫలమవడంతో 139 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన డసెన్... మిల్లర్ (33 బంతుల్లో 24; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి పరిస్థితి చక్కదిద్దాడు. తర్వాత ఫెలుక్‌వాయో (37 బంతుల్లో 39 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సర్లు) ధాటిగా ఆడటంతో దక్షిణాఫ్రికా సంచలనానికి తావివ్వకుండా గెలిచింది. అబేద్యమైన ఆరో వికెట్‌కు డసెన్, ఫెలుక్‌వాయో 65 పరుగులు జోడించారు.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	9	7	2	14	1.261
ఆస్ట్రేలియా	8	6	2	12	0.861
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	9	4	5	8	-0.336
ఇంగ్లండ్	8	2	6	4	-0.885
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా × బంగ్లాదేశ్
వేదిక: పుణే
ఉదయం గం. 10:30 నుంచి

ఇంగ్లండ్ × పాకిస్తాన్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రన్నరప్ నైశిక్ రెడ్డి జోడీ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య జూనియర్ సర్క్యూట్ టోర్నీలో తెలంగాణకు చెందిన గనగామ నైశిక్ రెడ్డి రన్నరప్‌గా నిలిచాడు. ఢాకాలో జరిగిన ఈ టోర్నీలో నైశిక్ రెడ్డి-ప్రబీర్ ముకేశ్ చావ్లా (భారత్) ద్వయం బాలుర డబుల్స్ విభాగం ఫైనల్లో ఓటమి చవిచూసింది. తుది పోరులో నైశిక్-ప్రబీర్ జోడీ 2-6, 3-6తో భారత్‌కే చెందిన తవీశ్ పావా-అర్జవ్ యాదవ్ జంట చేతిలో ఓటమి పాలైంది.

సెమీస్‌లో అభయ్ నిష్క్రమణ



న్యూఢిల్లీ: నియోస్ వెనిస్ వెర్టె ఓపెన్ స్క్వాష్ టోర్నీలో భారత ప్లేయర్ అభయ్ సింగ్ సెమీఫైనల్లో నిష్క్రమించాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం రెండో సీడ్ రోరీ స్టీవర్ట్ (స్కాట్లాండ్)తో జరగాల్సిన సెమీఫైనల్లో అభయ్ గాయం కారణంగా బరిలోకి దిగకుండా తన ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చాడు. క్వార్టర్ ఫైనల్లో అభయ్ 11-1, 7-11, 19-17, 8-11, 11-6తో ఆరో సీడ్ విక్టర్ బైర్టస్ (చెక్ రిపబ్లిక్)పై గెలిచాడు.

సినిమా

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ



● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ-మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ– ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు

''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.



● కాజల్

వేటాడే సత్యభామ

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసినట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్



● ధనుష్, ఇళయరాజా

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ –''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యూరి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక



● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

''మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ– ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.

లింగి లింగిడి..!



● రాహుల్, శివానీ, మిథున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.



● జాన్వీ కపూర్

రెండు హృదయాల కల

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చుస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

మాస్ రింగు...



● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్- కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘురామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్



● 'ది ట్రయల్' పోస్టర్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.

ప్రేమలో గీతాశంకరం



● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ– ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్



''అలా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ–''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.